28 నుంచి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ

ఏలూరు : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఐఎల్ఓ సంయుక్త ఆధ్వర్యంలో భీమడోలులోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఈ నెల 28వ తేదీ బుధవారం నుంచి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గంటా సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంవత్సరానికిగాను జెబిఐ, ఎస్‌వైబి అనే రెండు ప్రోగ్రాములను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నిరుద్యోగులకు మొత్తంగా ఎనిమిది రోజులపాటు ఔత్సాహిక వ్యాపారవేత్తకు అవసరమైన సూచనలు, సలహాలు, అనుమతులకు సంబంధించి, బ్యాంకింగ్ రంగానికి సంబంధించి, స్టాండ్ అప్ ఇండియా ముద్ర లోన్స్, పిఎంఇజిపి లోన్స్, ఇతర ఎస్ఎస్‌జి రుణాలకు సంబంధించి మెప్మా, డిఆర్‌డిఎ శాఖల ద్వారా పూర్తి అవగాహన కల్పిస్తామని తెలిపారు. శిక్షణ పూర్తయిన వారికి సర్టిఫికెట్‌తోపాటు బ్యాంకు రుణ సౌకర్యం కూడా కల్పించే విధంగా తగిన చర్యలు తీసుకుని వారిని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తయారు చేయడమే ఈ కార్యక్రమ ముఖ్యోద్దేశమని చెప్పారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు సురేష్ (8184887146)ను సంప్రదించి రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

గ్రామసభల సందడి

నేడు ప్రతి గ్రామ పంచాయతీలోనూ ఉపాధి హామీ సభలు

ఏలూరు జిల్లాలో 547, పశ్చిమలో 408 గ్రామ పంచాయతీల్లో సభలు

ప్రతి మండలానికీ ప్రత్యేక అధికారుల నియామకం

అభివృద్ధి పేరుతో అత్యధికంగా కాంపోనెంట్ పనులపైనే ప్రభుత్వం ఫోకస్

ఈ పనులతో ఉపాధి కూలీలకు పెద్దగా ప్రయోజనం శూన్యం

ఉపాధి హామీ జాబితాలో ప్రకటించిన 46 పనుల్లో అత్యధికం అంతే

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఉపాధి హామీ పనులపై గ్రామసభలకు సిద్ధమైంది. శుక్రవారం ఏలూరు జిల్లాలో 547, పశ్చిమగోదావరి జిల్లాలో 408 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ గ్రామసభలు నిర్వహించేందుకు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గ్రామసభలను విజయవంతంగా జరిపేందుకు ప్రతి మండలానికి జిల్లాస్థాయి అధికారులను ప్రత్యేక అధికారిగా నియమించారు. గ్రామ పంచాయతీల్లో జరిగే గ్రామసభలో పంచాయతీ కార్యదర్శి కన్వీనర్‌గా ఉండగా, మండలస్థాయి అధికారులు పాల్గొని గ్రామసభలు నిర్వహించనున్నారు. జిల్లా అధికారులు, మంత్రులు, ఎంఎల్‌ఎలు, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున ఈ సభల్లో పాల్గొనున్నారు. ప్రభుత్వం ఉపాధి హామీ పనుల జాబితాలో 46 పనులు గుర్తించింది. గుర్తించిన జాబితాలో పనులకు సంబంధించి గ్రామసభల్లో చర్చ జరగనున్నట్లు చెబుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో అత్యధికం ఉపాధి కూలీలకు పెద్దగా ప్రయోజనం లేని పనులే ఉన్నాయి. ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో చెరువుల పూడికతీత పనులు లేవు. ఉపాధి కూలీలు అత్యధికంగా చేసే పనుల్లో చెరువుల పూడికతీతలే ఉంటాయి. ఆ పనులను ఉపాధి హామీ జాబితా నుంచి తొలగించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి భూముల్లో చేపల చెరువుల పునరుద్ధరణ, వ్యక్తిగత భూముల్లో బెంచ్ టెర్రెసింగ్ నిర్మాణం, రైతుల పొలాల్లో గడ్డి పెంపకం, పశువులు, గొర్రెలు, కోళ్ల షెడ్ల నిర్మాణం వంటి పనుల్లో ఉపాధి కూలీలను ఉపయోగించే పరిస్థితి పెద్దగా ఉండదు. ప్రస్తుతం ఉపాధి హామీ పనుల్లో భాగంగా కూలీలకు వంద రోజులు పని కల్పిస్తున్నారు. పని దినాలను 200 రోజులకు పెంచాలని కూలీలు డిమాండ్ చేస్తున్నారు. అటువంటి పరిస్థితుల్లో కూలీలకు పనులు తగ్గించే విధంగా ప్రభుత్వం పనుల జాబితాను రూపొందించడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం ప్రతిపాదించిన పనుల జాబితా పరిశీలిస్తే కూలీలకు తీవ్ర నష్టం వాటిల్లే పరిస్థితి కనిపిస్తోంది. ఇప్పటికే సరాసరిన ఏడాదికి 30 రోజులు మాత్రమే ఉపాధి హామీ పని దినాలు జరుగుతున్నాయి. ఇప్పుడు మరింత తగ్గించే ఎత్తుగడకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగుతున్నాయనే విమర్శలు విన్పిస్తున్నాయి.

అత్యధికం కాంపోనెంట్ పనులపైనే దృష్టి

ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభల్లో అత్యధికం కాంపోనెంట్ (యంత్రాలు చేసే పనులు)పైనే దృష్టి సారించిన పరిస్థితి కన్పిస్తోంది. శుక్రవారం జరగనున్న గ్రామసభల్లో సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు, బిటి రోడ్లకు సంబంధించిన పనులపై సభల్లో చర్చ జరగనున్నట్లు చెబుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో రూ.70 కోట్లు కాంపోనెంట్ పనులకు సంబంధించి గ్రామసభల్లో చర్చలు సాగనున్నాయి. ఏలూరు జిల్లాలోనూ అదే పరిస్థితి నెలకొంది. కాంపోనెంట్ పనుల్లో అత్యధికం యంత్రాలతోనే చేయిస్తారు. కూలీలకు పెద్దగా పనులు ఉండవు. గ్రామసభల్లో కూలీలకు ప్రయోజనం చేకూరేలా పనులు కల్పించేందుకు చర్చలు సాగించాలని అంతా కోరుతున్నారు. అప్పుడే గ్రామసభలకు ప్రయోజనం చేకూరుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం అభివృద్ధి పేరుతో ఉపాధి హామీ నిధులకు సంబంధించిన పనులను కాంపోనెంట్ పరిధిలోకి తీసుకెళ్తే కూలీలకు పనులు లేకుండాపోయే దుస్థితి ఏర్పడనుంది.

ఇసుక పాలసీలో మార్పు

పటిష్టంగా అమలుకు చర్యలు

స్టాక్‌పాయింట్ ప్రాంతంలో సచివాలయాల్లో బుకింగ్

వాహనాలు క్యూ లేకుండా ముందుగానే సమయం నిర్దేశితం

అక్రమాలపై తేల్చేందుకు టోల్‌ఫ్రీ నెంబర్

కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్

మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లాలో ఇసుక పాలసీలో మార్పులు చేసి పటిష్టంగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు, ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన ఉచిత ఇసుక విధానాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. గురువారం స్థానిక జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్‌పి కె.ప్రతాప్ శివకిషోర్‌తో కలిసి ఇసుక పాలసీకి సంబంధించిన వివరాలు వెల్లడించారు. జిల్లాలో ప్రజలకు ఇసుక అందించేందుకు మూడు స్టాక్ పాయింట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటిలో భాగంగా కుక్కునూరు మండలంలో ఇబ్రహీంపేట, వింజరం, ఉంగుటూరు మండలం చేబ్రోలు ప్రాంతాల్లో ఇసుక పాయింట్లు (స్టాక్ యార్డులు) ఏర్పాటు చేశామన్నారు. ఇబ్రహీంపేట స్టాక్ యార్డ్‌లో 70 వేల మెట్రిక్ టన్నులు, వింజరం స్టాక్‌యార్డ్‌లో వెయ్యి మెట్రిక్ టన్నులు, చేబ్రోలు స్టాక్‌యార్డ్‌లో 451 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉన్నట్లు వివరించారు. ఇసుక బుకింగ్ కోసం ఈ స్టాక్ యార్డుల సమీపంలోని సచివాలయాల్లో బుకింగ్ కౌంటర్లు ఓపెన్ చేసినట్లు చెప్పారు. ఇసుక బుకింగ్ సమయంలో కొనుగోలుదారుడు తమ ఆధార్ కార్డు సమర్పించాలని, ఆయా వాహనాల నెంబర్లు స్టాక్‌యార్డులోకి ప్రవేశించే సమయాన్ని బుకింగ్ సమయంలోనే నిర్ణయిస్తారన్నారు. ఇసుక ఉచితంగా అందజేస్తున్నప్పటికీ రవాణా ఛార్జీలు మాత్రం నామమాత్రంగా కిలోమీటర్ల లెక్కన చెల్లించాల్సి ఉంటుందన్నారు. కొనుగోలుదారుడికి 20 టన్నులు మాత్రమే ఇసుక అందజేస్తామని స్పష్టం చేశారు. వ్యక్తిగత నిర్మాణదారుడికి మాత్రమే ఇసుక సరఫరా చేస్తామన్నారు. దీనిలో భాగంగా ట్రాక్టర్ ఛార్జీలు జీరో నుండి పది కిలోమీటర్ల వరకు రూ.800, పది నుంచి 20 కిలోమీటర్ల వరకు రూ.1200, 20 నుంచి 30 కిలోమీటర్ల వరకు రూ.1800, 30 కిలోమీటర్లుపైబడి ఎంతదూరం రవాణా ఛార్జీలైనా కిలోమీటరుకు రూ.35 చొప్పున లెక్కగట్టి రవాణా ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆరు టైర్ల వాహనానికి జీరో నుంచి 10 కిలోమీటర్ల వరకు రూ.1540, 10 నుంచి 20 కిలోమీటర్ల వరకు రూ.2,420, 20 నుంచి 30 కిలోమీటర్ల వరకు రూ.3300, 30 కిలోమీటర్లుపైబడి ఎంతదూరం రవాణా ఛార్జీలైన కిలోమీటరుకు రూ.80 చొప్పున లెక్కగట్టి రవాణా ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పది టైర్లు వాహనానికి జీరో నుంచి 10 కిలోమీటర్ల వరకు రూ.2000, 10 నుంచి 20 కిలోమీటర్ల వరకు రూ.3000, 20 నుంచి 30 కిలోమీటర్ల వరకు రూ.4300, 30 కిలోమీటర్లుపైబడి ఎంతదూరం రవాణా ఛార్జీలైనా కిలోమీటరుకు రూ.120 చొప్పున లెక్కగట్టి రవాణా ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పర్మిట్ లేకుండా వాహనాన్ని గుర్తిస్తే సీజ్ చేస్తారని స్పష్టం చేశారు. ఇసుక విధానం అమల్లో ఏమైనా అక్రమాలు జరిగినా, అక్రమ రవాణా చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే స్టేట్ టోల్‌ఫ్రీ నెంబర్ 18005994599 లేదా ఏలూరు కలెక్టరేట్ కార్యాలయంలోని 08812-234014 నెంబర్లకు నేరుగా ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ప్రజల సౌకర్యార్థం గూటాల-1, పట్టిసీమ ప్రాంతాల్లో డీలిమిటేషన్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పర్యావరణ అనుమతులు వచ్చిన వెంటనే వీటిని అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు: ఎస్‌పి

తక్కువ ధరకు ప్రజలకు నాణ్యమైన ఇసుక అందించాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా పటిష్టచర్యలు తీసుకున్నట్లు జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్ తెలిపారు. అంతర్రాష్ట్ర సరిహద్దు వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి సీసీ కెమెరాల పర్యవేక్షణలో పటిష్ట నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఇసుక స్టాక్‌యార్డ్ నుండి బయలుదేరిన తర్వాత ఎక్కడైనా రవాణాలో అవాంతరాలు ఎదురైతే వెంటనే సంబంధిత టోల్ ఫ్రీ నెంబర్లకు సమాచారం అందిస్తే పోలీసుల తనిఖీల సమయంలో కొనుగోలుదారులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉండదని తెలిపారు. ఉచిత ఇసుక పాలసీ విధానం అందుబాటులోకి వచ్చిన దృష్ట్యా ఎవరైనా ఇసుకను అక్రమ రవాణా చేసేందుకు, నిల్వ చేసేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుని సంబంధిత వాహనాలను సీజ్ చేస్తారని ఎస్‌పి హెచ్చరించారు. చిన్న చిన్న ట్రాక్టర్లతో సరైన అనుమతులు లేకుండా స్థానికంగా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవన్నారు. కొత్త చట్ట ప్రకారం ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే జైలుకు వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు.

వెల్లమిల్లి పంచాయతీలో నిధులు గోల్‌మాల్..!

రూ.30 లక్షలకుపైనే చేతులు మారినట్లు అనుమానం

నేడు డిఎల్‌పిఒ చంద్రశేఖర్ విచారణ

వెల్లమిల్లి పంచాయతీ కార్యాలయం

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు మండలం వెల్లమిల్లి పంచాయతీలో రూ.30 లక్షలకుపైనే నిధులు పక్కదారి పట్టించి దుర్వినియోగం చేశారని ఆరోపిస్తూ గ్రామస్తులు రెండు విడతలుగా ఫిర్యాదు చేశారు. మూడు నెలల క్రితం ఫిర్యాదు చేసినా ఈ వ్యవహారంపై తక్షణమే విచారణ చేపట్టకుండా తాత్సారం చేయడంపై అనేక అనుమానాలు, ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పంచాయతీరాజ్ శాఖ కమిషనర్‌కు, డిపిఒకు అందిన ఫిర్యాదు మేరకు విచారణాధికారిగా ఏలూరు డిఎల్‌పిఒను నియమించారు. అక్రమాలు చేసిన బాధ్యులను కాపాడేందుకే విచారణ ఆలస్యమవుతోందని ఫిర్యాదుదారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే విచారణ చేయాలని కోరుతూ వెల్లమిల్లి గ్రామస్తులు గత సోమవారం పిజిఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ)లో మళ్లీ ఫిర్యాదు చేయడం గమనార్హం.

అక్రమాలు ఇవేనా..?

మెట్ట ప్రాంతానికి చెందిన వెల్లమిల్లి పంచాయతీలో చినవెల్లమిల్లి, చింతాయగూడెం, లంబాడీగూడెం ఆవాస ప్రాంతాల్లో పంచాయతీ ఆధీనంలో పెళ్లికొడుకు చెరువు, కొత్త చెరువు, చిన్న, పెద్ద కమ్మరిగుంట చెరువు, ఆంతవారి చెరువు, బీముని చెరువు, చింతలచెరువు, ఇటుకులగుంట చెరువు, చిన్నమంగళ కర్ర చెరువు, నరసయ్య చెరువు, మాదిగవాని గుంట చెరువు ఇలా 12కి పైగా చెరువులు ఉన్నాయి. ఈ చెరువులో చేపల పెంపకానికి వేలం పాట 2023 జులైలో నిర్వహించారు. మూడేళ్లపాటు చేపలు పెంచుకునేందుకు పాటదారులు సుమారు రూ.కోటికిపైగా పంచాయతీకి పన్ను చెల్లించాల్సి ఉంది. మొదటి విడతగా పాట సొమ్ములో మూడోవంతు అనగా అన్ని చెరువుల మీద ఏడాదికి రూ.35 లక్షలకుపైగా చెరువుల నిర్వాహకులు పసలీ సొమ్మును పంచాయతీకి చెల్లించగానే దాన్ని ట్రెజరీలో జమచేయాలి. అలా చెరువు పాటదారుల నుంచి మూడోవంతు పాట సొమ్ములో చాలా వరకూ వసూలు చేశారు. ఆ సొమ్మును పంచాయతీ హెడ్ ఖాతాకు జమ చేయకుండా నిధులు పక్కదారి పట్టించారనేది ప్రధాన ఆరోపణ. వీటితోపాటు ఇంటి కుళాయి కనెక్షన్లు, కుళాయి పన్ను కూడా జమ చేయలేదు అనేది మరో ఆరోపణ. కొన్ని చెరువులకు లీజు సమయం దాటిపోయినా.. సొమ్ము చెల్లించకపోయినా రెండోసారి పాట పెట్టేశారని మరో ఆరోపణ. ఈ ఆరోపణలన్నింటిపైనా అధికారులు విచారణ చేసి దస్త్రాలను పరిశీలిస్తేనే వాస్తవాలు బయటపడే అవకాశం ఉంది. పంచాయతీలో నిధులు పక్కదారి పట్టాయనే ఫిర్యాదు మేరకు ఈ నెల 23న విచారణకు వస్తున్నట్లు ఏలూరు డిఎల్‌పిఒ చంద్రశేఖర్ ప్రజాశక్తికి వివరించారు. విచారణకు రావాలని ఫిర్యాదుదారులకు, సర్పంచి, పంచాయతీ కార్యదర్శులకు నోటీసులు ఇచ్చినట్లు డిఎల్‌పిఒ చెప్పారు. ఆరోపణలు చేసిన వారు వారి దగ్గర ఉన్న రుజువులు, ఆధారాలు చూపించాలని, రికార్డులను పరిశీలించి తేడాలుంటే అవకతవకలు నిర్ధారణయ్యాకే తదుపరి చర్యలు ఉంటాయని ఆయన వెల్లడించారు.

ఏలూరు కమిషనర్‌గా భానుప్రతాప్

భానుప్రతాప్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు నగరపాలక సంస్థ నూతన కమిషనర్‌గా భానుప్రతాప్‌ను నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకూ ఇన్‌ఛార్జి కమిషనర్‌గా చంద్రశేఖర్ బాధ్యతలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. భానుప్రకాష్ బాపట్ల మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఏలూరు కమిషనర్‌గా నియమితులయ్యారు.

హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

పలుచోట్ల నిరసన

ఏలూరులో..

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల మహిళా సంఘం, భారత కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో మహిళలు, కార్మికులు ఏలూరులో గురువారం నిరసన ప్రదర్శన, సభ నిర్వహించారు. స్థానిక మార్కెట్ యార్డులో ప్రదర్శన అనంతరం ఐఎఫ్‌టియు ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి యర్ర శ్రీనివాసరావు అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సభలో ప్రగతిశీల మహిళా సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సహాయ కార్యదర్శి ఈమని మల్లిక మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దాడులు, హత్యలు, అత్యాచారాల విచారణ కోసం ప్రత్యేక విచారణ సంస్థ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం సుమోటోగా చేపట్టి చేస్తున్న విచారణలో బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. ఐఎఫ్‌టియు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకటరావు మాట్లాడుతూ మహిళలకు భారతదేశంలో రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. బిజెపి అధికారంలోకొచ్చిన గత పదేళ్ల నుంచి మహిళల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. మనువాద భావజాలాన్ని పెంపొందించడం వల్ల స్త్రీలను తక్కువగా చూస్తూ ఆట బొమ్మలుగా మార్చి వేశారన్నారు. రెండో తరగతి పౌరుల కంటే దారుణంగా స్త్రీలను చూస్తున్నారని విమర్శించారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, హైకోర్టు న్యాయవాది నంబూరి శ్రీమన్నారాయణ మాట్లాడుతూ మహిళలపై దాడులు, హత్యలు, హత్యాచారాలు మూలాల నిర్మూలనకు జస్టిస్ వర్మ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది కెవి.రత్నం, సింహాచలం, రాములమ్మ, పద్మ, రూప పాల్గొన్నారు.



చింతలపూడిలో...

చింతలపూడి : వైద్య విద్యార్థినిపై హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌విఎస్.నారాయణ డిమాండ్ చేశారు. పట్టణ కేంద్రంలో ఫైర్‌స్టేషన్ సెంటర్ కూడలి వద్ద సిఐటియు అనుబంధ సంఘాలు మెప్మా, ఐకెపి, మున్సిపల్ రంగాలకు సంబంధించిన మహిళా కార్మికులు నిరసన తెలిపారు. అనంతరం మెప్మా జిల్లా నాయకురాలు వి.ఝాన్సీరాణి మాట్లాడుతూ సంఘటన జరిగి 15 రోజులు కావస్తున్నా నేటికీ ఈ దారుణ ఘటనపై బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం నిందితులను అరెస్టు చేయడంలో వెనుకంజ వేస్తున్నాయఅన్నారు. ఐకెపి జిల్లా నాయకురాలు ఆమని మాట్లాడుతూ దేశంలో రోజురోజుకు మహిళలపై దాడులు పెరుగుతున్నాయని, అరికట్టడంలో వెనుకంజ వేస్తున్నాయని చెప్పారు. అనంతరం సిఐటియు సీనియర్ నాయకులు ఎస్.సూర్యకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వాలు తక్షణమే స్పందించి నిందితులను కాపాడకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి, జస్పిత, నాగమణి, సంకు జోషి, డి.సత్యనారాయణ పాల్గొన్నారు.

నూజివీడులో...

నూజివీడు టౌన్ : పట్టణంలోని ఎంప్లాయిస్ కాలనీలో ఉన్న ఎల్‌ఐసి కార్యాలయ ఆవరణలో గురువారం భోజన విరామ సమయంలో కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి ఎం.రామకృష్ణ ఆనంద్ మాట్లాడుతూ సమాజంలో విచ్చలవిడిగా ఉన్న మాదకద్రవ్యాలు, అశ్లీల వీడియోలతో రాను రాను నేరాల ప్రవృత్తి పెరిగిపోతోందన్నారు. తద్వారా బాలికలు, మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టాలను మరింత పటిష్టం చేసి మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వ్యక్తులపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. స్త్రీవాద రచయిత్రి నూతక్కి ఉమామహేశ్వరి మాట్లాడుతూ పని ప్రదేశాల్లో మహిళల రక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌ఐసి రిటైర్డ్ ఉద్యోగి నండూరి రామహనుమాన్లు, లియాఫీ నాయకులు టి.ప్రభాకరరావు, ఉద్యోగులు, అధికారులు, ఏజెంట్లు, పాలసీదారులు పాల్గొన్నారు.

సురక్షితంగా స్వస్థలానికి సుంకరమ్మ

కువైట్ బాధితురాలికి అండగా ఉంటామన్న కలెక్టర్

కలెక్టర్‌ను కలిసిన సుంకరమ్మ

ప్రజాశక్తి - ఏలూరు

బతుకుదెరువు కోసం కువైట్ వెళ్లి అక్కడ ఇబ్బందులు పడుతునమ్న బుట్టాయగూడెం మండలం మర్లగూడేనికి చెందిన తాటి సుంకరమ్మ (29) సురక్షితంగా స్వదేశానికి చేరుకుంది. ఆమె గత సంవత్సరం కువైట్ వెళ్లింది. అయితే అక్కడ పని చేయలేకపోవడంతో చిత్రహింసలకు గురవుతున్నట్లు, తిండి కూడా పెట్టడం లేదని, స్వదేశానికి వెళ్లడానికి అనుమతించడం లేదంటూ సెల్ఫీవీడియో తీసి తమ గ్రామానికి చెందిన టిడిపి నాయకుల ద్వారా పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు, ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ దృష్టికి చేరింది. దీనిపై వారు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో డిఆర్‌ఒ డి.పుష్పమణి, మహిళా, శిశు సంక్షేమ అధికారుల ద్వారా కువైట్ ఎంబసి, తెలుగు ఎన్‌ఆర్‌ఐ అసోసియేషన్‌తో మాట్లాడి అక్కడ లీగల్ ప్రాసెస్ కంప్లీట్ చేయించి ఇక్కడకు తిరిగొచ్చేందుకు టిక్కెట్లు సైతం ఏర్పాటు చేశారు. స్వదేశానికి చేరుకున్న సుంకరమ్మ డిఆర్‌ఒ ద్వారా గురువారం కలెక్టర్ వెట్రిసెల్విని కలిశారు. అక్కడ పడిన కష్టాలన్నీ చెప్పి సుంకరమ్మ భోరున విలపించింది. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ నెలవారీ ఆదాయం లభించేలా ఆమెకు ఏదోక ఉపాధి శిక్షణ ఇప్పించాలని డిఆర్‌డిఎ పీడీ విజయరాజును ఆదేశించారు. రేషన్‌కార్డు మంజూరు చేయడంతోపాటు ఇంటి నిర్మాణానికి అవసరమైన రుణం మంజూరు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

పోలవరం డిఎస్‌పిగా వెంకటేశ్వరరావు బాధ్యతల స్వీకరణ

వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం డిఎస్‌పిగా ఎం.వెంకటేశ్వరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఇంటెలిజెన్స్ డిఎస్‌పిగా ఇప్పటి వరకూ బాధ్యతలు నిర్వహించిన ఆయన ఇటీవల జరిగిన బదిలీల్లో పోలవరం వచ్చారు. నూతన డిఎస్‌పిగా బాధ్యతలు స్వీకరించిన డిఎస్‌పికి సిఐ జి.మధుబాబు, ఎస్ఐ పవన్‌కుమార్ పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ సబ్‌డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం నిర్విరామంగా కృషి చేస్తానన్నారు.

చట్టాలు సక్రమంగా అమలు చేయాలి

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి

సెయింట్ థెరిస్సాలో ఐద్వా, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన సెమినార్

సెమినార్‌లో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

దేశంలో మహిళలపై, బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడుల విషయంలో చట్టాలు సక్రమంగా అమలు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి డిమాండ్ చేశారు. స్థానిక సెయింట్ థెరిస్సా డిగ్రీ కళాశాలలో అఖిలభారత ప్రజాతంత్ర మహిళాసంఘం (ఐద్వా), భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఏలూరు జిల్లా కమిటీల ఆధ్వర్యంలో మహిళలపై జరుగుతున్న దౌర్జన్యాలపై గురువారం సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌కు కళాశాల లెక్చరర్ ఫాతిమా అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రమాదేవి మాట్లాడుతూ కొల్‌కత్తాలో వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచారాన్ని ఖండిస్తూ యావత్తు భారతీయులు ఆగ్రహంతో వీధుల్లోకి వస్తున్నారన్నారు. తల్లిదండ్రులు పిల్లల భద్రత మీద భయంతో, విచారంతో కుంగిపోతున్నారన్నారు. దీనికి కారణం రోజురోజుకు మహిళలపై పెరుగుతున్న దాడులు, అత్యాచారాలు అన్నారు. గతంలో దేశ రాజధాని ఢిల్లీలో, నేడు కొల్‌కత్తాలో, ఇలా దేశంలో అన్నిప్రాంతాల్లో మహిళలపై దారుణాలు, దాడులు, అత్యాచారాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. ఒక్కొక్క ఘటన తర్వాత ఒక్కొక్క చట్టం తీసుకొచ్చినా ఈ ఘటనలు ఆగటంలేదని, మరింత దారుణంగా జరుగుతున్నాయన్నారు. మన చట్టాల్లో ఉన్న లొసుగులు, అధికారం, డబ్బుతో సిగ్గు లేకుండా నిందితులు బయట యథేచ్ఛగా తిరుగుతున్నారన్నారు. నిందితులు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లాలో చుట్టుపక్కల ప్రాంతాల్లో కూడా ఇలాంటి దాడులు జరిగాయని, చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. జస్టిస్ వర్మ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని, ఆసుపత్రిలో వైద్యులు కోరుతున్న విధంగా వారు విశ్రాంతి తీసుకోవడానికి ప్రత్యేక గదులు, సెక్యూరిటీ ఏర్పాటు చేయాలని, ఆసుపత్రిలో అదనపు పని భారం తగ్గించడానికి సిబ్బందిని నియమించాలని, గంజాయి, డ్రగ్స్, మత్తుమందులు అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా అధ్యక్ష, కార్యదర్శులు పి.హైమావతి, ఎ.శ్యామలారాణి, జి.శారద, జె.హరీషదుర్గ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్, మనోజ్, డివైఎఫ్ఐ టౌన్ కార్యదర్శి పి.దుర్గాప్రసాద్, పి.కృష్ణవేణి, అధ్యాపకులు పద్మావతి, శ్రీలత, జ్యోతి కళాశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేయాలి

జోన్-2 మలేరియా అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మీనరసింహకుమార్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న వేళ వైద్య సిబ్బంది మరింత అంకితభావంతో పనిచేసి అంటువ్యాధులు అరికట్టాలని జోన్-2 మలేరియా అసిస్టెంట్ డైరెక్టర్ బి.లక్ష్మీనరసింహకుమార్ సూచించారు. స్థానిక ఏలూరు, గవరవరం, చొదిమెళ్లల్లో డెంగీ ప్రబలిన ప్రాంతాల్లో ఆయన గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడ సిబ్బందికి పలు సూచనలు చేశారు. వర్షాకాలంలో వైరల్ జ్వరాలు విజృంభించే అవకాశం ఉంది కాబట్టి సిబ్బంది అప్రమత్తంగా ఉండి అంటువ్యాధుల నిర్మూలనలో కీలక పాత్ర పోషించాలని, ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే తగు చర్యలు తీసుకుంటామన్నారు. డెంగీ కారక దోమ మంచి నీటి నిల్వ ప్రాంతాల్లో పెరుగుతుందని, ప్రజలకు డ్రైడేపై అవగాహన కల్పించాలని చెప్పారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ఏజెన్సీలో ప్రబలుతున్న విష జ్వరాలు

ఆసుపత్రికి క్యూ కడుతున్న రోగులు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం రూరల్

బుట్టాయగూడెంలోని కరాటం రంగనాయకమ్మ సామాజిక ఆరోగ్య కేంద్రంలో వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో వచ్చిన రోగులు బారులు తీరారు. ఏజెన్సీలో విష జ్వరాలు ప్రబలుతుండటంతో రోగులు ఆసుపత్రి బాట పడుతున్నారు. వైరల్, టైఫాయిడ్ జ్వర పీడితులు ఎక్కువగా ఉన్నట్లు సిబ్బంది చెబుతున్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు ఏపి ట్రాన్స్‌కో 132/33 కెవి ఏలూరు సబ్‌స్టేషన్‌లో అత్యవసర పనులు మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తూర్పు ప్రాంత విద్యుత్ కేంద్రం వారు తెలిపారు. ఆ సమయంలో ఏలూరు టౌన్, ఏలూరు రూరల్, వట్లూరు, శాంతి నగర్, శనివారపుపేట, పూలపల్లి, కలెక్టర్ బంగ్లా, కలెక్టరేట్, అశోక్ నగర్, ఆర్ఆర్.పేట, సంతోష్‌నగర్, కోటదిబ్బ, ఏలూరు వన్‌టౌన్, టూ టౌన్, త్రీ టౌన్, వెంకన్నట్యాంక్, కపర్తి, పెదపాడు మండలం, కొత్తూరు జ్యూట్ మిల్, తంగెళ్ళమూడి, జానంపేట, ఏలూరు ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

వేల్పుచర్లలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - ముసునూరు

వేల్పుచర్ల గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించినట్లు ముసునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు షకీనా ఇవాంజిలిన్ తెలిపారు. మండలంలోని వేల్పుచర్ల గ్రామంలోని ఎస్‌సి ఏరియాలో 52 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించగా, వారు సాధారణ జ్వరంతో ఉన్నారని వైద్యులు తెలిపారు. ముగ్గురికి జ్వరం ఉండటంతో మెరుగైన వైద్య సేవలు తమ సిబ్బందితో అందించినట్లు చెప్పారు.

భీమడోలులో ఎంఎల్ఎ ధర్మరాజు పర్యటన

ప్రజాశక్తి - భీమడోలు

గ్రామ సమస్యల గుర్తింపు కోసం ప్రత్యేకంగా ఈ నెల 23వ తేదీన నిర్వహించే గ్రామసభల సేవలను వినియోగించుకోవాలని ఉంగుటూరు ఎంఎల్ఎ ధర్మరాజు కోరారు. గురువారం ఆయన మండల కేంద్రమైన భీమడోలులో పర్యటించారు. దీనిలో భాగంగా సినీ నటులు చిరంజీవి అభిమానులు, రామ్‌చరణ్ టీం సంయుక్త ఆధ్వర్యంలో భీమడోలు సంతపేటలో నిర్వహించిన చిరంజీవి పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్నారు. కేకును కట్ చేసి మిఠాయిలను పంపిణీ చేశారు.

'మిషన్ వాత్సల్య'పై అవగాహన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని సమావేశ మందిరంలో గురువారం మిషన్ వాత్సల్య పథకంలో ఎంపికైన లబ్ధిదారులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్త్రీ శిశుసంక్షేమ శాఖ జిల్లా పీడీ కెవిఎల్.పద్మావతి మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు తల్లిదండ్రులు లేని పిల్లలకు చదువుకునే అవకాశం కల్పించడమే మిషన్ వాత్సల్య పథకం లక్ష్యమన్నారు. ఈ పథకం ద్వారా కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. విద్య, ఆహారం, ఆరోగ్యం పట్ల అవగాహనతో ముందడుగు వేయాలని సూచించారు. ఐసిడిఎస్ నూజివీడు సిడిపిఒ ఎస్‌వి.నూరాని మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు పిల్లలు చదువుపైనే దృష్టి ఉంచాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టడం ప్రతిఒక్కరి బాధ్యతగా గుర్తించాలన్నారు. నూజివీడు ఆర్‌డిఒ వై.భవానీశంకరి మాట్లాడుతూ తల్లిదండ్రులు వారి పిల్లలకు ఇవ్వాల్సింది బంగారం కాదని, బంగారం వంటి భవిష్యత్తును మాత్రం బాధ్యతగా ఇవ్వాలన్నారు.

హామీల అమలు కోరుతూ వినతి

ప్రజాశక్తి - కుక్కునూరు

ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రజా పంథా జంగారెడ్డిగూడెం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజుకు వినతిపత్రం అందించారు. ఎంఎల్ఎ బాలరాజును జీలుగుమిల్లి క్యాంపు కార్యాలయంలో గురువారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రజా పంథా జంగారెడ్డిగూడెం డివిజన్ కమిటీ కార్యదర్శి ఎస్‌కె.గౌస్ మాట్లాడుతూ గత ప్రభుత్వం కుక్కునూరు, పోలవరం ముంపు మండలాల్లో నిర్వాసితులకు ఇచ్చిన ఆర్అండ్ఆర్ ప్యాకేజీ పరిహారం హామీ నెరవేర్చలేదన్నారు. లక్షలాది కుటుంబాలకు, ఇళ్లకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇచ్చి ఒకేసారి గ్రామాలను ఖాళీ చేయించాలని కోరారు. 18 ఏళ్ళు నిండిన యువతకు కటీఫ్ తేదీ లేకుండా పరిహారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు సిరికొండ రామారావు, గడ్డల ముత్యాలరావు, డివిజన్ నాయకులు కట్టమ్ వీరాస్వామి, కట్టమ్ ముత్యాలరావు, నార్లవరం ఎంపిటిసి సభ్యులు కట్టమ్ రత్తమ్మ, తిరుమలాపురం సర్పంచి సోడే విజయ, డివిజన్ నాయకురాలు ఎస్‌కె.మున్నీ, మేడేపల్లి సర్పంచి కట్టమ్ రాంబాబు, మేడిపల్లి ఎంపిటిసి సభ్యులు తుర్రం తమ్మయ్య పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ఐ ఫోన్ కొనలేదని

బాలుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఐ ఫోన్ కొనలేదని బాలుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఈ ఘటన ఏలూరు రూరల్ పరిధిలోని హనుమాన్ నగర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు రూరల్ పరిధిలోని హనుమాన్ నగర్‌కు చెందిన బాలుడు రామకృష్ణ (17) పదో తరగతి వరకు చదివి ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆ బాలుడు తనకు ఐ ఫోన్ కొనాలని తల్లిదండ్రులను అడిగాడు. ఫోన్ కావాలని కొంతకాలంగా మారం చేస్తున్నాడు. తల్లిదండ్రులు ఇటీవలే బాలుడి సోదరి పెళ్లి చేయడంతో ఐ ఫోన్ కొనే ఆర్థిక స్తోమత లేక నిరాకరించారు. ఈ క్రమంలో ఈ నెల 14వ తేదీన బాలుడు రామకృష్ణ ఇంటి వద్దనే ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇది గమనించిన తల్లిదండ్రులు వెంటనే బాలుడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం అక్కడి నుంచి గుంటూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ ఘటనపై ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం ఏలూరు తరలించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జీలుగుమిల్లిలోని వైన్ షాపు సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... పాలచర్ల, రాజవరం సమీపంలోని వాగు నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను ట్రాక్టర్‌పై లోడ్ చేసి తరలిస్తుండగా జీలుగుమిల్లి సమీపంలో పట్టుకున్నట్లు తెలిపారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

నాటుసారా స్థావరంపై దాడి

ప్రజాశక్తి - కుక్కునూరు

నాటుసారా స్థావరంపై దాడి చేసిన పోలీసులు వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి నాటుసారా స్వాధీనం చేసుకుని, బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కుక్కునూరు సిఐ ఎం.రమేష్‌బాబుకు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ ఎస్.రామకృష్ణ తన సిబ్బందితో మండలంలోని తెల్లరాయిగూడెం గ్రామ ప్రాంత శివారులో నాటుసారా స్థావరంపై దాడి చేశారు. ఈ దాడిలో కొవ్వాక గ్రామానికి చెందిన సంజీవయ్యను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 22 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. 450 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

చింతలపూడి :విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బోయగూడెం గ్రామానికి చెందిన గుంజు శ్రీనుకు చెందిన గేదె విద్యుదాఘాతంతో మృతి చెందింది. కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందిందని బాధితుడు తెలిపారు. గేదె విలువ లక్ష రూపాయాలు ఉంటుందని వాపోయాడు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి - నిడమర్రు

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరి నాట్లు వేసుకున్న రైతాంగం పూర్తిగా నష్టపోయారని, ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని రైతు సంఘం జిల్లా నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిడమర్రులో ప్రజా సంఘాల కార్యాలయంలో గురువారం రైతు సంఘం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు మాట్లాడుతూ రైతులందరూ ఐక్యంగా ఉండి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పాపోలు రాంబాబు, గౌరవ అధ్యక్షులుగా అందే పుల్లారావు, కార్యదర్శిగా లావేటి సోంబాబు, కానూరు రాజు, ఇప్పిలి షోలేము, సింగంపల్లి ముత్యాలు, కొండేటి నాగబాబు, పేరంటాలు ఎన్నికయ్యారు.

రైతులు ఇ-క్రాప్ నమోదు చేయించుకోవాలి

ప్రజాశక్తి - పోలవరం

మండలంలో రైతులు విధిగా ఇ-క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.రాంబాబు సూచించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ పోలవరం మండలంలో అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఇ-పంట నమోదు కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. రైతులు తమకు అందుబాటులో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో సాగు చేసిన పంట రకాల వివరాలు తెలియజేయాలని కోరారు. మండలంలో ఇప్పటివరకు 4,625 ఎకరాల వరి పంటకు 1,709 ఎకరాలు, 414 ఎకరాల మినుము పంట నమోదైందని తెలిపారు. ఇ-పంట నమోదు వల్ల రైతులు తమ పంటకు మద్దతు ధర పొందవచ్చని, అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలు పెట్టుబడి రాయితీ, ఇన్సూరెన్సు పొందవచ్చని తెలిపారు. ఇప్పటివరకూ మండలంలో 41 శాతం ఇ-పంట నమోదైనట్లు తెలిపారు.

ఇ-పంట నమోదుతో రైతులకు మేలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

పంటల బీమా, పంట నష్టం తదితర పథకాలను అందుకోవాలంటే ప్రతి రైతు కచ్చితంగా ఇ-పంట నమోదు చేయించుకోవాలని భీమడోలు ఎడిఎ పి.ఉషారాజకుమారి అన్నారు. ఉంగుటూరు మండలంలో గురువారం ఇ-పంట నమోదు ప్రక్రియను ఆమె పరిశీలించారు. మండలంలో 23049 ఎకరాల్లో వరి పంట ఉండగా ఇప్పటివరకూ 3528 ఎకరాల్లో ఇ-పంట నమోదైందన్నారు. రైతులు, సాగుదారులు సహకరించాలని కోరారు. ఆమెతో పాటు ఇన్‌ఛార్జి ఎఇ రవి, వ్యవసాయ శాఖ సిబ్బంది ఉన్నారు.

కెమిస్ట్రీ గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

బుట్టాయగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కెమిస్ట్రీ గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కుసుమ సంజీవని తెలిపారు. పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం పైబడి మార్కులు పొందిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి గలవారు 23వ శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల లోపు బుట్టాయగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 24వ తేదీ పది గంటలకు ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు.

పంచాయతీ కార్యదర్శుల నియామకం

ప్రజాశక్తి - ముసునూరు

మండల పరిధిలోని పలు గ్రామాలకు గ్రేడ్‌బి-2 పంచాయతీ కార్యదర్శులు బదిలీపై వచ్చినట్లు ఎంపిడిఒ జి.రాణి తెలిపారు. మండల పరిధిలోని చక్కపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా కె.సుజాత, చింతలవల్లి గ్రామపంచాయతీ కార్యదర్శిగా ఎం.నూరాజి, కాత్రేనిఆపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా బి.రామచంద్రరావులను గ్రేడ్-2 పంచాయతీ కార్యదర్శులుగా నియమించినట్లు తెలిపారు.

అభివృద్ధికి అధిక ప్రాధాన్యత

ఉంగుటూరు ఎంఎల్ఎ ధర్మరాజు

ప్రజాశక్తి - ఉంగుటూరు

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఉంగుటూరు ఎంఎల్ఎ ధర్మరాజు అన్నారు. మండలంలో గురువారం నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్ర మాలు ప్రారంభం, శంకుస్థాపనల కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. చేబ్రోలులో సర్వ శిక్ష అభియాన్ నిధులు రూ.23.70 లక్షలతో నిర్మించిన ఉర్దూ పాఠశాల అదనపు తరగతి గదులను ఎంఎల్ఎ ధర్మరాజు ప్రారంభించారు. ఉంగుటూరు జగనన్న కాలనీలో తాగునీటి అవసరాల కోసం రూ.37.04 లక్షల జలజీవన్ మిషన్ నిధులతో మంచినీటి ట్యాంకు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు బండారు సింధు, రాందే లక్ష్మీసునీత, ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు పాతూరి విజయ్ కుమార్, బండారు మధు, రాందే రాజారావు, సూరత్తుల అయ్యప్ప, గురువెల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ ధర్మరాజు

మేజర్ డ్రెయినేజీల్లో పూడికతీత

పోలవరం :పోలవరం పంచాయతీలో మేజర్ డ్రెయినేజీల పూడిక తీత పనులు గురువారం పంచాయతీ కార్యదర్శి వై.కొండలరావు ఆధ్వర్యంలో యుద్ధప్రాతిపదికన నిర్వహించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పోలవరం పంచాయతీలో జగన్నాథపేట, బాపూజీ కాలనీ, కొత్తపేట గ్రామాల్లో నీటి నిల్వలు పెరిగి ప్రజానీకం ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో పంచాయతీ సర్పంచి పొడుం పుష్ప ఆదేశాల మేరకు జగన్నాథపేట మొదటి వీధి నుంచి పంచాయతీ కార్యాలయం వరకూ ఉన్న మేజర్ డ్రెయినేజీలపై ఉన్న కాంక్రీట్ బల్లలు తొలగించి యంత్రాలతో పూడిక తీయించి ట్రాక్టర్లతో తరలించారు. దీంతో గ్రామాల్లో ఉన్న నీటి నిల్వలు క్రమక్రమంగా మేజర్ డ్రెయినేజీ ద్వారా కొవ్వాడ కాలువలోకి అక్కడి నుంచి కడమ్మ స్లూయిజ్ ద్వారా గోదావరిలోకి ప్రవహిస్తున్నాయి.

నేడు ఉపాధి హామీపై గ్రామ సభలు

ప్రజాశక్తి - పోలవరం

మండలంలో ఈ నెల 23వ తేదీ శుక్రవారం గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ జి.శ్రీను గురువారం తెలిపారు. మండలంలో 13 పంచాయతీల్లో పలు అభివృద్ధి పనుల విషయంలో గ్రామ సభలు నిర్వహించి ప్రజాభిప్రాయ సేకరణ చేయనున్నట్లు చెప్పారు. ఉదయం చేగొండపల్లి, గూటాల, జిల్లెల్లగూడెం, గెడ్డపల్లి, పోలవరం, ప్రగడపల్లి ఇటుకలకోట, కొత్తపట్టిసీమ గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం నుంచి మామిడిగొంది, పట్టిసీమ, ఎల్ఎన్‌డిపేట, వింజరం గ్రామాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలో అన్ని పంచాయతీల గ్రామాల ప్రజలు గ్రామ సభల్లో పాల్గొనాలని కోరారు.

ముసునూరు :ఉపాధి హామీ చట్టం పనుల నిమిత్తం మండలంలోని 16 గ్రామాల్లో ఈ నెల 23వ తేదీ గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ జి.రాణి తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఆయా మండల స్థాయి అధికారులతో ప్రత్యేక పర్యవేక్షణలో ఉపాధి హామీ పనిలో భాగంగా గ్రామసభలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

చింతలపూడి : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ నెల 23వ తేదీ శుక్రవారం గ్రామసభలు జరుగుతాయని ఎంపిడిఒ మురళీకృష్ణ తెలిపారు. ప్రగడవరం గ్రామ పంచాయతీలో కలెక్టర్ వెట్రిసెల్వి, చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ హాజరవుతారని చెప్పారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో సీజనల్ వ్యాధులు దూరం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

పరిసరాల పరిశుభ్రతతో పాటు, వ్యక్తిగత శుభ్రతను పాటించడం వల్ల సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చని ఆగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి జాస్తి జగన్మోహన్‌రావు అన్నారు. ఆగిరిపల్లి పిహెచ్‌సి పరిధిలోని మల్లిబోయినపల్లి గ్రామంలో వైద్యాధికారి జగన్మోహన్‌రావు ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామస్తులకు రక్త పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. అనంతరం గ్రామంలో ప్రతి ఇంటికి దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ రత్నబాబు, వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు : ఎంఎల్ఎ రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

చదువు ఒక్కటే తలరాతలను మారుస్తుందని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. లింగపాలెం మండలం శ్రీ సాయి ప్రతిభ జూనియర్, డిగ్రీ కాలేజీలో గురువారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు ఒక్కటే ఉన్నత స్థాయికి తీసుకువెళ్తుందన్నారు. ప్రతి విద్యార్థిలో ఏదో ఒక నైపుణ్యం ఉంటుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు ఇతర వ్యాయామాలు, క్రీడలు, ఇతర నైపుణ్యాలపై దృష్టి పెట్టాలన్నారు. విద్యార్థుల్లో ఉన్న ఇతర ప్రతిభలను అధ్యాపకులు ప్రోత్సహించాలని కోరారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ముఖ్యంగా విద్యార్థినులకు అవసరమైతే పోలీస్ ప్రొటెక్షన్ ఇస్తానని చెప్పారు.

ఎంఎల్ఎ రోషన్‌కుమార్‌ను సత్కరిస్తున్న సిబ్బంది

చిరంజీవి యువత మండలాధ్యక్షులుగా సుబ్రహ్మణ్యం

కలిదిండి :చిరంజీవి యువత మండలాధ్యక్షులుగా జడ్డు సుబ్రహ్మణ్యం నియమితులయ్యారు. అఖిల భారత చిరంజీవి యువత ఉపాధ్యక్షులు ఎస్.కృష్ణప్రసాద్, రాష్ట్ర చిరంజీవి యువత ఉపాధ్యక్షులు ఇల్లూరి సుగుణ బాబు, జిల్లా అధ్యక్షులు వర్రె హనుమప్రసాద్ ద్వారా నియామక పత్రం అందినట్లు సుబ్రహ్మణ్యం తెలిపారు.

వినియోగదారుల అవసరాలకు ప్రాధాన్యత

ఇండియన్ బ్యాంక్ మేనేజర్ జ్యోతిప్రసాద్

ప్రజాశక్తి - మండవల్లి

కస్టమర్ల అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ సమర్థవంతంగా సేవలందించేందుకు కృషి చేస్తున్నామని ఇండియన్ బ్యాంక్ మేనేజర్ కె.జ్యోతిప్రసాద్ తెలిపారు. ఇండియన్ బ్యాంకులో గురువారం నిర్వహించిన కస్టమర్ మీట్‌లో ఆయన కస్టమర్లతో మాట్లాడారు. ఇండియన్ బ్యాంక్ కస్టమర్లకు సకాలంలో విశిష్టమైన సేవలందిస్తుందన్నారు. అంతేకాకుండా ఇండియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం కస్టమర్ల సమావేశం నిర్వహించడం ద్వారా కస్టమర్ల దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. మరింత మెరుగైన సేవలను కస్టమర్లకు అందించేందుకు ఈ సమావేశాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం ఆర్థిక అక్షరాస్యత, వివిధ స్కీముల గురించి ఆయన కస్టమర్లకు వివరించారు. ఈ సందర్భంగా కస్టమర్లు మాట్లాడుతూ బ్యాంకును సెంట్రల్ ఎసి చేయాలని, క్యాష్ డిపాజిట్ ఎటిఎం మెషిన్ కూడా ఏర్పాటు చేయాలని కోరారు. బ్యాంకులో తరచూ సిబ్బందిని మార్చడం వల్ల సరైన సేవలు సమయానికి అందక ఇబ్బందులు పడుతున్నామని ఆయన దష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు, మాజీ సర్పంచి గుడివాడ చిట్టిబాబు, గుడివాడ తంబు స్వామి, పి.శ్రీనివాసరావు, మెండ సురేష్, రాజేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

కుక్కునూరు :సిజిఆర్ఎఫ్ ఎపిఇపిడిసిఎల్ ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీ శుక్రవారం జీలుగుమిల్లి విద్యుత్ సబ్ డివిజన్‌లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు వారి కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నారు. జంగారెడ్డిగూడెం డివిజన్ పరిధిలోని కుక్కునూరు, వేలేరుపాడు, జీలుగుమిల్లి మండలాలకు సంబంధించిన విద్యుత్ వినియోగదారులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సిజిఆర్ఎఫ్ కార్యదర్శి తెలిపారు

ఘనంగా చిరంజీవి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

పద్మవిభూషణ్, డాక్టర్ మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలను జనసేన ఏలూరు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ సినీ రంగంలో తనకంటూ ముద్ర వేసుకుని నటనలో ఎంతో ఉన్నత స్థాయికి ఎదిగి ఎందరికో స్ఫూర్తినిస్తున్న వ్యక్తి పద్మవిభూషణ్ డాక్టర్ మెగాస్టార్ చిరంజీవి అని అన్నారు. సినీ రంగంలోనే కాకుండా సేవా రంగంలోను మొదటగా గుర్తొచ్చేది మెగా ఫ్యామిలీ అని అన్నారు. రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయించి, ఎంతోమంది అభిమానులు చేత రక్తం దానం చేయాలని స్ఫూర్తిని కల్పించిన వ్యక్తి డాక్టర్ మెగాస్టార్ చిరంజీవి అని అన్నారు. కంటి చూపు లేని వారికి నేత్రదానం చేయమని ప్రజలకు, అభిమానులకు సూచించారన్నారు. అనంతరం ఏలూరులో 18 రోజులు ఎంతో శ్రమించి 7,583 క్రియాశీలక సభ్యత్వాలు నమోదు చేయించిన 63 మంది క్రియాశీలక వాలంటీర్లకు కీర్తికృష్ణమనాయుడు, కరిముల్లా మెమెంటోను చేయించి రెడ్డిఅప్పలనాయుడు చేతుల మీదుగా అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ఎన్నికల కన్వీనర్ రాఘవయ్య చౌదరి, మాజీ డిప్యూటీ మేయర్ శిరిపల్లి ప్రసాద్, చేనేత రాష్ట్ర కార్యదర్శి దోనేపూడి లోవరాజు, జిల్లా కార్యదర్శి కస్తూరి సాయి తేజస్విని, నగర అధ్యక్షులు నగిరెడ్డి కాశీ నరేష్, వివిధ హోదాల్లో ఉన్న జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, మెగా అభిమానులు, క్రియాశీలక వాలంటీర్లు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలు పట్టణంలో ఉమ్మడి కృష్ణాజిల్లా చిరంజీవి యువత జాయింట్ సెక్రటరీ సత్రపు సుధీర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ద్వారకా థియేటర్‌లో ఇంద్ర సినిమా రీ రిలీజ్ సందర్భంగా ఇంద్ర సినిమాను భారీగా మెగా అభిమానులు తిలకించారు. ముఖ్య అతిథిగా జనసేన నూజివీడు నియోజకవర్గ సమన్వయకర్త బర్మా ఫణిబాబు హాజరై ఇంద్ర సినిమాను తిలకించారు. అనంతరం థియేటర్ ఆవరణలో మెగా అభిమానుల సమక్షంలో జరిగిన కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నూజివీడు మెగా సీనియర్ అభిమాని కస్తూరి రాము, మెగా అభిమానులు, జనసేన నాయకులు బొబ్బిలి శ్రీకాంత్, తోట వెంకటరావు, సూరిశెట్టి శివ, బజారు దుర్గాప్రసాద్, పాశం నాగబాబు, జక్కుల లక్ష్మి, బొజ్జ పవన్, రాజేష్, దుర్గ, షేక్ ఇమ్రాన్, గొల్లపల్లి శ్రీకాంత్, గిరి పాల్గొన్నారు.

నిడమర్రు : మండలంలోని భువనపల్లి పాఠశాలలో నిర్వహించిన మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకల్లో ఉంగుటూరు ఎంఎల్ఎ ధర్మరాజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మెడికల్ క్యాంపు నిర్వహించి విద్యార్థులకు పరీక్షలు చేసి వారికి విటమిన్ మాత్రలను అందించారు. అనంతరం స్కూల్ విద్యార్థినులతో కలిసి ఎంఎల్ఎ ధర్మరాజు కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన, టిడిపి, బిజెపి నాయకులు, కార్యకర్తలు, మెగా అభిమానులు పాల్గొన్నారు.

కలిదిండి : కలిదిండిలో చిరంజీవి అభిమాన సంఘం ఆధ్వర్యంలో కైకలూరు ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ కేక్ కట్ చేసి స్వీట్స్ పంచారు. నాయకులు చిట్టూరి రవీంద్ర, నల్లగోపుల చలపతిరావు, పన్నాస పూర్ణచంద్రరావు, లంకా రత్నారావు, జడ్డు సుబ్రహ్మణ్యం, గుండ్రాల హనుమ అయ్యప్ప, చిట్టూరి సురేష్, చిరంజీవి అభిమానులు పాల్గొన్నారు.

ప్రకటన

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
డెటార్ ఐ.పి.నెం.20/2024.

బిట్వీన్:
1.కొత్తపల్లి బాల మురళీకృష్ణ .. పిటీషనర్
V/s
2.పూసల రామ్‌మోహన్‌రావు వగైరా
..రెస్పాండెంట్స్/1 to 41.

ఈ ప్రకటన ద్వారా యావన్మందికి తెలియజేయునది ఏమనగా పై నెంబరు గ్రంధములో పిటీషనర్, రెస్పాండెంట్స్‌పై ఇన్సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని డెటార్ ఐ.పి. శ్రీకోర్టు వారు ముందు వాజ్యము దాఖలు చేసియున్నారు. అందుపై యావన్మందికి తెలియజేయునది ఏమనగా ఏవిధమైన అభ్యంతరములు గాని, ఆక్షేపణలు గాని ఉన్న యెడల ది.23.09.2024లో సం॥రం॥ తేదీన ఉదయం 10.30 ని॥లకు శ్రీకోర్టు వారి ముందు స్వయంగా గాని, న్యాయవాది ద్వారా కాని హాజరై, శ్రీ కోర్టు వార్కి అభ్యంతరములు గాని ఆక్షేపణలు గాని తెలియజేయవలెను. లేనియెడల పిటీషనరు తరపున తీర్మానించబడునని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

తంగెళ్ళ వెంకటేశ్వరరావు
ఎం.ఎ.బి.ఎల్. న్యాయవాది,
నరసాపురం నరసాపురం, ప.గో.జిల్లా, ఆం.ప్ర.,
ది.23.08.2024 సెల్ నెం.9848273438

ప్రకటన

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో నరసాపురం
ఐ.పి.నెం.3/2002

బిట్వీన్:
1. బండి నాగరత్నం, భర్త: సత్యనారాయణ. డోరునెం.2-117/2, స్కూలు పెదమామిడిపల్లి, పాలకొల్లు మండలు,
2. బండి సత్యనారాయం. తండ్రి సుబ్బారావు డోర్ నెం.2-117/2, స్కూలు, పెదమామిడిపల్లి, పాలకొల్లు మండలం. ...పిటీషనర్లు
మరియు
1. గుత్తులు శ్రీనివాసరావు మరియు 30 నుండి వగైరా ...రెస్పాండెంట్లు

పై నంబరు ఇన్సోల్వెన్సీ పిటీషన్లో పిటీషనర్లు వారికి గల బాకీలను తీర్చలేని పరిస్థితులలో 31 మంది రెస్పాండెంట్స్ పై, డెటార్ ఇన్సోల్వెన్సీ పిటిషన్ దాఖలు చేసియున్నారు. మరియు సదరు ప్రొవిన్సియల్ ఇన్సోల్వెన్స్ ఆక్టు అండర్ సెక్షన్ 31(1) ప్రకారము జనరల్ ప్రొడక్షన్, వగైరా రిలీఫ్స్ కోరుచూ దాఖలు చేసియున్నారు. దానిపై శ్రీకోర్టు వారి ఉత్తర్వుల మేరకు పైన చూపించిన 31 మంది. రెస్పాండెంట్లకు గానీ, మరి ఏ యితరులకు గాని, ఏమైనా అభ్యంతరములు ఉన్నయెడల ది.02-09-2024 సం. తేదిన ఉదయం గం.10-30 ని.లకు శ్రీకోర్టు వారి యెదుట స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరై పై పిటిషన్ నందు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల తెలియజేసుకోవలెను. లేనియెడల పై పిటీషన్ మీకు పరోక్షముగా తీర్మానించబడును. దరిమిలా వచ్చే ఆక్షేపణలు ఏమీ పిటీషనర్లను బైండ్ చేయవని యిందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.

కామన బాల సత్యనారాయణ,
స్థలం: నరసాపురం, పిటీషనరు తరపు అడ్వకేట్,
తేది.20-8-2024 నరసాపురం, సెల్:9848660100

NAME CHANGE

I, **BOKKA BABY KUMARI** (Maiden Name) **KADALI HEMA SRI** (Married Name) wife of Anjaneyulu resident of Door No.4-64, Koneru Gattu, Chintala garuvu, Vaddiparru, Poduru Mandal, West Godavari District, shall hence forth be known as **BOKKA HEMA SRI** (Maiden Name) **KADALI HEAMA SRI** (Marital Name) wife of Anjaneyulu for purpose of correction of wrong entries occurred in School Records due to Parental mistake.

మార్కులిస్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా గణపవరం మండలం కేశవరం గ్రామ కాపురస్తులైన జోగి సాయి శ్వేత తండ్రి శివాజీ అను నేను నా యొక్క ఇంటర్ మార్క్ లిస్ట్ ఒరిజినల్ సర్టిఫికెట్ కేశవరం నుండి గణపవరం SBI సెంటర్లో జిరాక్స్ తీయించుకుని మా ఇంటికి వచ్చే మార్గ మధ్యలో ఇంటర్ మార్క్ లిస్ట్ మరియు జిరాక్స్ తో సహా కవర్లో పెట్టుకుని బండికి తగిలించి వెళ్లే మార్గ మధ్యలో ఎక్కడ పడిపోయిందో తెలియదు ఎంత వెతికిన దొరిక లేదు దొరికినవారు ఈ కింది ఫోన్ నెంబర్ కు తెలియజేయగలరు .

జోగి సాయి శ్వేత, తండ్రి శివాజీ, కేశవరం గ్రామం, గణపవరం మండలం, పశ్చిమగోదావరి జిల్లా. సెల్ 7993751833

NAME CHANGE

I, **KUDIPUDI BHUVANESWARI** (Maiden Name) **KADALI BHUVANESWARI** (Married Name) wife of Hareesh resident of Door No.3-104, Chintalagaruvu, Vaddiparru, Poduru Mandal, West Godavari District, shall henceforth be known as **KUDIPUDI PAVANI** (Maiden Name) **KADALI PAVANI** (Marital Name) wife of Hareesh for purpose of correction of wrong entries occurred in School Records due to Parental mistake.

ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
ఒ.యస్.నెం.211/2014

బిట్వీన్ :
చేబ్రోలు రాంబాబు వగైరాలు ...వాద్దు
మరియు
బోడిగడ్ల రాంబాబు వగైరాలు ...ప్రతివాద్దు

పై నెంబరు దావా ఆస్థి మీరు ది.08-05-2018 సం॥ తేదీన బోడిగడ్ల రాంబాబు గారి వద్ద క్రయము పొందనారని మిమ్ములను అనగా పర్వతనేని లక్ష్మణ ప్రసాద్, తండ్రి కోటేశ్వరరావు, ఇంటి నెం.29-4-44/3రు, శాంతినగర్, ఏలూరు సిటీని పై నెంబరు దావాలో 3వ ప్రతివాదిగా చేర్చినారు. మీకు ఎన్నిపర్యాయములు దావా సమన్లు పంపిననూ తీసికొనక నిరాకరించుచున్నారు. గాన మీరు ది.29-8-2024 సం॥రం తేదీ ఉదయం గం.10.30 ని॥లకు పైకోర్టు వారి యెదుట స్వయముగా కాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరయి మీ వాదన దాఖలు చేసుకొనవలయును. అట్లు మీరు హాజరు కాని యెడల మీ పరోక్షమున తీర్మానము చేయుదురు.

పి.ఆంజనేయరాజు
అడ్వకేటు, తాడేపల్లిగూడెం.
సెల్ : 9848018256

IN THE COURT OF THE HONBLE ADDL. CIVIL JUDGE (SENIOR DIVISION) ELURU, W.G.DIST.
I.A.659/2024 in O.S.No.33/2022

Between:
Methukumilli Rama Tulasi ...Petitioner
&
Marumudi Venkamma & Others ....Respondents
2.Konda@ Marumudi Lakshmi Nirmala, W/o.Yahoshuva, R/o.D.No.12-16-40, 2nd Street, Gandhi Nagar, Nidadavolu Village & Mandal, W.G.Dist.,
5. Ganupamu Appalakonda @Aruna, W/o.Kanakarao, R/o.D.No.2-20, Goods Shed Road, Pandurangapuram, Eluru, Eluru Dist.,
7. Adari Kanakavara Vijayalakshmi, W/o.Balaji, R/o.D.No.10-17, Gowrisankarapuram, Makkinavarigudem Post, T.Narasapuram Mandal, Eluru Dist.,
8. Amballa Sanjive, S/o. Durga Prasad, R/o.D.No.4-12, Undarajavaram Village, Pothunuru Post, Denduluru Mandal, Eluru Dist.,
9. Samudrala Leela Maheswara Rao, S/o. Venkata Madhusudhana Rao, GPA Agent, R/o.R.R.Pet, Eluru, Eluru Dist.,
R10: Marumudi Raju, S/o.(Late) Venkateswara Rao, R/o.D.No.4-14, Madepalli Village, Eluru Mandal, Eluru Dist.
R11: Ammireddy Prasad, S/o. (Late) Nageswara Rao, R/o.D.No.9-149, Indira Nagar, Bapulapadu Village, Krishna Dist.

పై నెంబరు దావాలో పై ప్రతివాదులకు ఎన్నిపర్యాయములు నోటీసులు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున పై కోర్టు వారు R2, R5, R7, R8, R9, R10, R11 ప్రతివాదులు అయిన మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా దావా నోటీసులు అమలు చేయుటకు ఆర్డరు వేసి యున్నారు. పై దావా ది.05.09.2024వ తేదీ ఉదయం గం. 10.30 ని॥కు శ్రీకోర్టుకు హాజరు అయి మీ ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేనియెడల దావా మీ పరోక్షమున విచారించబడును.

(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
ఎన్.వై.వి.ప్రసాద్, ఎన్.రాముడు
ఏలూరు అడ్వకేట్స్, ఏలూరు.
22-5-2024 సెల్:7780194120